
క్లుప్తంగా

కళాశాల వసతి గృహం తనిఖీ



పెర్కిట్: పెర్కిట్‌లో ఉన్న బీసీ కళాశాల వసతి గృహాన్ని ఎంఈవో రాజ గంగారం బుధవారం తనిఖీ చేశారు. వసతి గృహంలో వంటశాల, బాత్‌రూంలను పరిశీలించి పరిశుభ్రత పాటించాలని వార్డెన్ అర్చనకు సూచించారు. వంటశాలలో నిలువ చేసిన ముడిసరుకులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

నలంద విద్యార్థుల క్షేత్ర పర్యటన



పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి నలంద హైస్కూల్ విద్యార్థులు బుధవారం క్షేత్ర పర్యటన చేపట్టారు. సాంఘిక శాస్త్రంలోని భారతదేశ వ్యవసాయం అనే పాఠ్యాంశంపై అవగాహన కల్పించేందుకు పాఠశాల యాజమాన్యం విద్యార్థులను క్షేత్ర పర్యటనకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరిసర గ్రామాల్లో ఉన్న పంట పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నలంద ప్రసాద్, ప్రిన్సిపాల్ నలంద సాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువుల షెడ్డు నిర్మాణానికి భూమి పూజ



బాల్కొండ: మండలంలోని నాగాపూర్‌కు చెందిన నారాయణకు ప్రజాపాలనలో భాగంగా ఉపాధి హామీ పథకంలో పశువుల షెడ్డు మంజూరైంది. షెడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం భూమి పూజ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిన్న నర్సయ్య, ఏపీవో ఇందిరా, రైతులు పాల్గొన్నారు.

మత్స్యసహకార సంఘాల ఆడిట్



బాల్కొండ: మెండోరా మండలం సోన్‌పేట్‌లో మత్స్య సహకార సంఘం, మహిళా సంఘాల ఆడిట్‌ను ఆడిట్ అధికారి నర్సింగ్‌రావు బుధవారం నిర్వహించారు. ఏడాదిలో పొదుపు, ఖర్చుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంఘం అధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి తొపారం నర్సయ్య, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



కమ్మర్‌పల్లి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు పునరుత్పాదక శక్తి వనరులు అనే అంశంపై బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజా పాలనా ప్రజా విజయోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వీరిని జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు ఎంఈవో పేర్కొన్నారు. కోనాపూర్ హెచ్ఎం రాంప్రసాద్, కోనసముందర్ హెచ్ఎం మధుపాల్, హాసాకొత్తూర్ హెచ్ఎం కృష్ణకుమార్, ఉపాధ్యాయులు లక్ష్మీనర్సయ్య, బంతిలాల్, రమేశ్, దీప, సుభాశ్, శ్రీనివాస్, నాగభూషణం, సురేందర్, రాజేశ్, లలిత పాల్గొన్నారు.

మాలల సింహగర్జన పోస్టర్ల ఆవిష్కరణ



వేల్పూర్: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో డిసెంబర్ 1న నిర్వహించే మాలల సింహగర్జన పోస్టర్లను మండలంలోని కుకునూర్ గ్రామంలో మాలసంఘం సభ్యులు బుధవారం ఆవిష్కరించారు. మండలంలోని అన్ని గ్రామాల మాలలు అత్యధికంగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వాటాల మాటున ఇసుక దందా!

- పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా
- పట్టించుకోని అధికారులు



నాగంపేట్ మీదుగా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్

బాల్కొండ: మోర్తాడ్ మండలం శెట్‌పల్లి శివారు నుంచి ఇసుక అక్రమ రవాణా మండల స్థాయి అధికారుల వాటాల మాటున జోరుగా సాగుతోంది. అధికార పార్టీ నియోజకవర్గ పెద్దలు వినియోగదారులకు తక్కువ ధరకు ఇసుకను అందించాలనే లక్ష్యంతో ఇసుకను తరలిస్తున్నా ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. కాళేశ్వరం నుంచి అనుమతితో ఇసుక తీసుకున్న ట్రాక్టర్‌కు రూ. ఆరు వేలకు లభిస్తున్నా అదే పెద్దవాగు నుంచి ఇసుక తీసుకున్నా అంతే ధరకు వస్తోంది. కారణం కేవలం అధికారుల వాటాలు పెరగడంతోనే ఇసుక ధర పెరుగుతోంది. వారం రోజులుగా పెద్ద వాగు నుంచి నిత్యం వందల ట్రాక్టర్ల ఇసుక తరలుతోంది. మండల స్థాయి రెవెన్యూ, పోలీసు అధికారులకు ట్రాక్టర్‌కు ఇంత చొప్పున ఇసుక అక్రమ వ్యాపారులు చెల్లిస్తున్నారు. వీరు ఆ మొత్తాన్ని వినియోగదారుల వద్దే ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. దీంతో అధికారులు ఇసుక తరలింపుపై కన్నెత్తి చూడటం లేదు.

ఉన్నతాధికారులు స్పందించి అధికారుల వాటాల బాగోతంపై పూర్తి విచారణ చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

అక్కడక్కడ ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇసుక అక్రమ రవాణా రోజుకు వందల ట్రాక్టర్లు నడుస్తుంటే అధికారులు మాత్రం అక్కడక్కడ రెండు ట్రాక్టర్లను పట్టుకొని మమ అనిపిస్తున్నారు. రెండు రోజుల క్రితం మెండోరా మండల కేంద్రంలో ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. మళ్లీ గంట గడవక ముందే వాటిని వదిలి పెట్టారు. ఉన్నతాధికారులు స్పందించి వినియోగదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అధికారులకు ఎందుకు..

వినియోగదారులకు తక్కువ ధరకు ఇసుకను అందించాలనే లక్ష్యంతో ఇసుకను తరలిస్తే అధికారులకు ఎందుకు వాటాలు చెల్లిస్తున్నారు. ఆ భారాన్ని వినియోగదారులపై ఎందుకు వేస్తున్నారు. వినియోగదారులకు భారం కావద్దనే ప్రభుత్వానికి డీడీల రూపంలో చెల్లించే వే బిల్లులు వద్దనుకున్నారు. అలాంటప్పుడు అధికారులకు ఎందుకు చెల్లిస్తున్నారో ఇసుక వ్యాపారులే చెప్పాలి. పెద్దవాగు నుంచి ఇసుకను తరలిస్తే ఏ గ్రామ శివారు నుంచి ఇసుకను తరలిస్తున్నామో ఆ గ్రామ వీడీసీకి రూ. 2 వేలు చెల్లిస్తున్నారు. ఇదీ చాలదన్నట్లు అధికారులకు వాటాలు చెల్లిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వినియోగదారులకు తక్కువ ధరకు ఇసుకను అందించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గడువులోగా డాటా ఎంట్రీ పూర్తి చేయాలి



సర్వే వివరాల నమోదును పరిశీలిస్తున్న డీఆర్‌డీవో



డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న అధికారులు

కమ్మర్‌పల్లి: సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన వివరాల నమోదును గడువులోగా పూర్తి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్ సిబ్బందికి సూచించారు. కమ్మర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో చేపడుతున్న సర్వే వివరాల నమోదును బుధవారం పరిశీలించారు. సర్వేలో సేకరించిన అంశాలను తప్పులు లేకుండా కంప్యూటరీకరించాలన్నారు. నమోదు ఎంతవరకు పూర్తయిందో ఎంపీడీవోను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ ఆంజనేయులు, ఐకేపీ ఏపీఎం కుంట గంగాధర్, ఈజీఎస్ ఏపీవో విద్యానంద్ తదితరులు ఉన్నారు.

రెంజల్‌లో..

రెంజల్: రెంజల్‌లోని ఆదర్శ పాఠశాలలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి సర్వే డాటా ఎంట్రీని అధికారులు బుధవారం పరిశీలించారు. బోధన్ డీఎల్‌పీవో మధుకర్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్ సందర్శించారు. తప్పులకు ఆస్కారం లేకుండా నమోదు చేయాలని ఆపరేటర్లకు సూచించారు. నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎమ్మారై రవి ఉన్నారు.

ముప్కాల్ ఎంపీడీవోగా నరేశ్‌కుమర్



ఎంపీడీవోను సన్మానిస్తున్న సిబ్బంది

బాల్కొండ: ముప్కాల్ ఎంపీడీవోగా నరేశ్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు విధులు నిర్వహించిన మహమద్ వర ముజాఫరొద్దీన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో నరేశ్‌కుమార్ వేములవాడ నుంచి బదిలీపై వచ్చారు. అనంతరం ఎంపీడీవోను కార్యాలయ సిబ్బంది, అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీవో గౌస్‌మొహినుద్దీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలి



క్రీడాకారులతో ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ రాజశేఖర్



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఆర్మూర్‌టౌన్: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాణించి జాతీయస్థాయికి ఎదగాలని ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ అన్నారు. పట్టణంలోని మినీస్టేడియంలో రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల హ్యాండ్‌పోటీలకు జిల్లా క్రీడాకారులకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని ఈరవత్రి రాజశేఖర్ సందర్శించి మాట్లాడారు. క్రీడాకారులు పోటీల్లో రాణించి జిల్లా కీర్తిని చాటాలన్నారు. అనంతరం క్రీడా దుస్తుల కోసం రూ. 10వేల ఆర్థికసాయం అందజేశారు. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గంగామోహన్ చక్రు మాట్లాడుతూ.. ఈనెల 29 నుంచి డిసెంబర్ 1 వరకు మినీస్టేడియంలో 46వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక

వర్ని: మండలంలోని జాకోర హై స్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు మానస, బంటు మౌనిష్, బంజ లోకేశ్ ఎంపికైనట్లు హెచ్ఎం అలీమ్ బుధవారం పేర్కొన్నారు. విద్యార్థులు ఈ నెల 29 నుంచి డిసెంబర్ 1 వరకు కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించొద్దు

రుద్రూర్/ వేల్పూర్/ బాల్కొండ/ మాక్లూర్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో బాల్య వివాహ్ ముక్త్ భారత్ పై పాఠశాలలు, కళాశాలల్లో అధికారులు, ఉపాధ్యాయులు విద్యార్థినులకు బుధవారం అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని అన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి తహసీల్దార్ గంగాధర్ హాజరై మాట్లాడారు. బాల్య వివాహ నిరోధక చట్టం గూర్చి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సాయిలు, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మణి, సుమలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు. బాల్య వివాహాలు నిరోధించాలని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వేల్పూర్ మండల కేంద్రంలో హైస్కూలు విద్యార్థులచే బాల్య వివాహ్ ముక్త్ భారత్ ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాలు జరగనివ్వమని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, పవన్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. ముప్కాల్ మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'బాల్ వివాహ్ ముక్త్ భారత్'పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ మాధవి, ఎంపీవో గౌస్ మొయినుద్దీన్, హెచ్ఎం గంగారాం, అంగన్ వాడీ టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. మాక్లూర్ మండలంలోని కేజీబీవీలో ప్రత్యేకాధికారి స్రవంతి ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్ వరలక్ష్మి అన్నారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ సునీత, జ్యోత్స్న, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు నసీమా, రజిత, భారతి విద్యార్థినులు పాల్గొన్నారు.



కోటగిరిలో మాట్లాడుతున్న తహసీల్దార్ గంగాధర్



వేల్పూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



ముప్కాల్‌లో..



మాక్లూర్‌లో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ వరలక్ష్మి

సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆర్మూర్: పట్టణంలోని పిప్రిరోడ్డులో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు 9వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారని హెచ్ఎం పూర్ణచందర్ తెలిపారు. మెదక్ జిల్లా మాసాయిపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో జిల్లా జట్టు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో విజయం సాధించిందన్నారు. పాఠశాలకు చెందిన విష్ణు, నిహాల్, సాయిబాబా, ప్రణీత్, ప్రవీణ్, రోహిత పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే జాతీయస్థాయి పోటీలకు బి. విష్ణు ఎంపికయ్యాడని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను వైస్ ప్రిన్సిపాల్ సాయన్న, వ్యాయామ ఉపాధ్యాయులు జ్ఞానేశ్వర్, పీఈటీ రాజేందర్, సాఫ్ట్‌బాల్ కోచ్ నరేశ్ అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆర్మూర్‌టౌన్: మండలంలోని అంకాపూర్‌లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీఈ కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్, జక్రాన్‌పల్లి మండలం మునిపల్లిలో విద్యుత్ పనుల నిర్వహణలో భాగంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

రెంజల్: మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో అధికారులు బుధవారం ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. రెవెన్యూ, పోలీస్, ఆర్టీవో అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఓవర్‌లోడ్, ట్యాక్స్, ఇన్సూరెన్స్, ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. కలెక్టర్, బోధన్ సబ్ కలెక్టర్ సూచనల మేరకు ఆయా శాఖల అధికారులతో కలిసి వాహనాల తనిఖీ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణాను నియంత్రించేందుకు ముమ్మర తనిఖీలు చేస్తున్నట్లు వివరించారు. ఆయన వెంట రెంజల్ ఎస్సై సాయన్న, బోధన్ ఎంవీఐ శ్రీనివాస్, ఎమ్మార్ఐ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

జనవరి నాటికి సాగునీరందించేందుకు కృషి



పంపు హౌస్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ మాజీ చైర్మన్

మాక్లూర్: ధర్మోరా చెరువును ఆధారంగా చేసుకుని నిర్మిస్తున్న బొంకన్‌పల్లి మినీ లిఫ్ట్ నుంచి 2025 జనవరి నాటికి పంటల సాగుకు నీరందించేందుకు కృషి చేస్తామని ఇరిగేషన్ డీఈ ఎం రవికుమార్ అన్నారు. మండలంలోని ధర్మోరా చెరువు వద్ద సంబంధిత పంప్ హౌస్‌ను జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నాగారి విఠల్‌రావు, ఇరిగేషన్ డీఈ ఎం రవికుమార్, ఏఈఈ దివ్యభారతి బుధవారం పరిశీలించారు. మూడు కిలోమీటర్ల పొడవున పైప్‌లైన్ వేయాల్సి ఉందని రెండు రోజుల్లో ఆ పనులు ప్రారంభించి అందుబాటులోకి తెస్తామని అధికారులు అన్నారు. రైతులు ప్రమోద్, శ్యామ్‌రావు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



మాక్లూర్: మండలంలోని కల్లెడిలో పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బీజేవైఎం నాయకుడు గంగోళ్ల ప్రళయ్‌తేజ్ బుధవారం అందజేశారు. నాయకులు సిరికొండ సాయికుమార్, మీరా అనిల్‌కుమార్, అరుణ్, ఇసపల్లి భూమయ్య, బి నగేశ్, వెంకటేశ్, రాజు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



వర్ని: చందూర్ మండలం లక్ష్మాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం పాలాభిషేకం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యానికి క్వింటాలుకు అదనంగా రూ. 500 బోనస్ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. లక్ష్మాపూర్ మాజీ సర్పంచ్ మల్లయ్య, నర్సింలు, ఉమర్, కృష్ణ, సుమన్, సాయిలు, చింత శ్రీనివాస్, గోపాల్, బాలయ్య పాల్గొన్నారు.

సాంకేతిక అభివృద్ధి గణితంపై ఆధారపడింది



ఎడపల్లి: ప్రపంచంలో సాంకేతిక అభివృద్ధి, భౌగోళిక రంగంలో పరిణామాలు గణితంపై ఆధారపడ్డాయని డీఈవో అశోక్ అన్నారు. బుధవారం మండలంలోని ఏఆర్పీ క్యాంప్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి గణితం సెమినార్ నిర్వహించారు. పాఠశాలలో గణితం పరిశోధన ల్యాబ్‌ను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఎంఈవో సాయిలు, హెచ్ఎం రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారణ



కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్లూర్‌లో ఉన్న రుషికొండ అయ్యప్ప క్షేత్రంలో బుధవారం అయ్యప్ప మాలధారణ కార్యక్రమం నిర్వహించారు. సొదాల వినోద్ గురుస్వామి 30 మంది దీక్షాపరులకు అయ్యప్ప మాలధారణ చేశారు. అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ క్షేత్రం అయ్యప్ప నామస్మరణతో మారుమోగింది.

దత్తాపూర్ లిఫ్ట్ సమస్యలు పరిష్కరించాలని వినతి



డొంకేశ్వర్: మండలంలోని దత్తాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ లిఫ్ట్ కమిటీ సభ్యులు బుధవారం ఇరిగేషన్ డీఈ రవి కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. చివరి ఆయకట్టు పంటలకు నీరందించడానికి మధ్యలో డీపీ చాంబర్లు ఏర్పాటు చేయాలన్నారు. స్పందించిన డీఈ రవి కుమార్ వారంలోగా పనులు పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడిశరం భూమేశ్ రెడ్డి, లిఫ్ట్ ఇరిగేషన్ ఉమ్మడి మండలాధ్యక్షుడు మోర్తాడ్ భోజారెడ్డి, దత్తాపూర్ లిఫ్ట్ చైర్మన్ వెంకటరమణ, వైస్ చైర్మన్ రవీందర్, నాయకులు నాగరాజు, భూమన్న ఉన్నారు.

దివ్యాంగులకు పింఛన్ పెంచాలి



రుద్రూర్: మండలంలోని తహసీల్ కార్యాలయం ఎదుట డిమాండ్ల సాధనకు దివ్యాంగులు బుధవారం ధర్నా నిర్వహించారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో వారు తహసీల్ కార్యాలయానికి తరలివచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ. పదివేల పింఛన్ అందించాలని నినాదాలు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు పింఛన్ పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. యేశాల గంగాధర్, జల్లాపురం సాయిలు. జక్కు శంకర్, డి రాజేందర్, హరీఫ్, ఇక్బాల్, పోశెట్టి, సుభద్ర, వీరమణి తదితరులు పాల్గొన్నారు.


ఎరువులు అందుబాటులో ఉంచాలి

రుద్రూర్: యాసంగి సీజన్ ప్రారంభమవుతున్నందున ఎరువులు అందుబాటులో ఉంచాలని పోతంగల్ వ్యవసాయాధికారి నిశిత సూచించారు. పోతంగల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం సింగిల్ విండో కార్యదర్శులు, ప్రైవేటు డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎరువులను ఎమ్మార్పీ ధరలకు విక్రయించాలన్నారు. రసీదులు తప్పని సరిగా ఇవ్వాలన్నారు. మండలంలోని వ్యవసాయ విస్తీర్ణాధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు అందజేత

మాక్లూర్: సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని గొట్టిముక్కల, మాక్లూర్ ప్రభుత్వ పాఠశాల్లో రోటరీక్లబ్ నిజామాబాద్ అధ్యక్షుడు విజయ్‌రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన డీఈవో అశోక్ చేతుల మీదుగా విద్యార్థులకు సైకిళ్లను అందించారు. విద్యార్థుల్లో సాధికారత కోసమే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు రోటరీక్లబ్ ఆఫ్ నిజామాబాద్ సభ్యులు వెల్లడించారు. అనంతరం గొట్టిముక్కలలో నిర్వహించిన హెచ్ఎం సచ్చిదానంద్ పదవీ విరమణ కార్యక్రమంలో డీఈవో పాల్గొని సన్మానించారు. ఎంఈవో సత్యనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, నగేశ్‌రెడ్డి, మోహన్, సురేశ్, మెట్టు లక్ష్మీనారాయణ, దేవారెడ్డి, రాధాకిషన్, మహేశ్, కరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 –	మందిర (తెలుగు)-10.30 దేవకి నందన వాసుదేవ (తెలుగు)-1.15 7.30 జిబ్రా(తెలుగు)-4.05 10.25
స్క్రీన్-3 –	మెకానిక్‌రాకీ(తెలుగు)-12.15 6.45 10.00 లక్కీ భాస్కర్(తెలుగు)-3.30
స్క్రీన్-4 –	అమరన్(తెలుగు)-11.35 6.20 మెకానిక్‌రాకీ(తెలుగు)-3.05 లక్కీభాస్కర్(తెలుగు)-9.50

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	అమరన్ -10.30 4.25 10.30 లక్కీ భాస్కర్(తెలుగు)-1.30 7.40
స్క్రీన్-3	కంగువ(2డీ-తెలుగు)-10.30 4.30 10.40 అమరన్ -1.30 7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	కంగువ 3డీ తెలుగు-11.50 3.15 6.40 10.10
స్క్రీన్-2	గ్లాడియేటర్-2 (తెలుగు)-12.10 మట్కా(తెలుగు)-3.35 7.00 క(తెలుగు)-10.25
స్క్రీన్-3	అమరన్(తెలుగు)- 11.45 3.15 6.50 లక్కీ భాస్కర్(తెలుగు)-10.25
స్క్రీన్ -4	క(తెలుగు)-1.00 లక్కీ భాస్కర్(తెలుగు)-4.15 గ్లాడియేటర్(తెలుగు)- 7.30 అమరన్(తెలుగు)- 10.45
లలితామహల్	దేవర పార్ట్-1 (తెలుగు)
దేవి	మట్కా (తెలుగు)
నటరాజ్	అమరన్ (తెలుగు)
విజయ్	కంగువ 3డీ (తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	77,300	వెండి(కిలో)	94,000
22 క్యారెట్స్	71,317		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800